ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు జిల్లా వార్తలు

మంగళవారం 19 మార్చి 2024





వి.కోట బాలికోన్నత పాఠశాలలో అనుతించక పోవడంతో పడేసిన ప్యాడ్లు



వి.కోట బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో ఎమ్మెల్యే స్టిక్కర్లతో ఉన్న ప్యాడ్లను తీసుకెళుతున్న విద్యార్థులు

కోడ్ ఉంటే మాకేంటి?

- ఎమ్మెల్యే ఫొటోతో టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ
- కొన్ని పరీక్షా కేంద్రాల్లో అధికారుల అభ్యంతరం
- ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఆర్డీవోకు ఫిర్యాదు
- వీటిని అనుమతించొద్దంటూ ఎంఈవోలకు ఆదేశాలు

వి.కోట, మార్చి 18: మేము అధికార పార్టీ.. ఎన్నికల కోడ్ ఉంటే మాకేంటని అనుకున్నారేమో? పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫొటోలతో ఉన్న ప్యాడ్లను నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్యాడ్‌కు ముందు వెనుకా ఆయన ఫొటోలున్నాయి. ఈ ప్యాడ్లతో పలువురు విద్యార్థులు సోమవారం పరీక్షా కేంద్రాలకు వచ్చారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొన్నిచోట్ల అధికారులు అభ్యంతరం చెప్పారు. వి.కోటలోని బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఈ ప్యాడ్లను అనుమతించకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద పడేసి వెళ్లారు. మిగిలిన పలు కేంద్రాల్లో వాటిని అనుమతించారు. పరీక్షలు ముగించుకుని బయటకు వస్తున్న విద్యార్థుల చేత ఈ ప్యాడ్లను చూసి తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఇలాంటి ప్యాడ్లను ఎలా అనుమతించారని కొందరు అధికారులను ప్రశ్నించారు. ఈ ప్యాడ్లను ఫొటోలు, వీడియోలు తీసి కొందరు మీడియా ప్రతినిధులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. వీటిని పరిశీలించిన ఆర్డీవో మనోజ్‌రెడ్డి.. ఇది కోడ్ ఉల్లంఘనేనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎక్కడా ఇలాంటి ప్యాడ్లను అనుమతించొద్దంటూ ఎంఈవోలకు ఆదేశాలిచ్చారు.

మీడియాపై ఎంపీపీ బెదిరింపులు

ఏడేళ్లుగా తమ ఎమ్మెల్యే విద్యార్థులకు విద్యా సామగ్రి ఇస్తుంటే ఇప్పుడు అభ్యంతరమేంటని, ఎందుకని ఫిర్యాదు చేశావంటూ మీడియా ప్రతినిధిపై వైసీపీకి చెందిన ఎంపీపీ యువరాజ్ ఫోనులో ఆగ్రహించారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన అని గుర్తుచేయగా.. 'రేయ్ నీది చాలా ఎక్కువైంది. జాగ్రత్తగా ఉండు. లేకుంటే నీకథ చూస్తాం' అంటూ బెదిరించారు. 'ఏం చంపేస్తారా.. రండి' అంటూ మీడియా ప్రతినిధి ఎదురుతిరగడంతో సరే చూస్తామంటూ ఫోన్ పెట్టేశాడు. తనను బెదిరించిన విషయాన్ని, కాల్ రికార్డ్‌ను ఆయన ఆర్డీవోకు పంపారు. కలెక్టర్ షన్మోహన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సీరియస్ అయ్యారు. ఈ ప్యాడ్లను అనుమత్తించరాదని ఆదేశిస్తూ.. మీడియా ప్రతినిధిని బెదిరించిన ఎంపీపీపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోండి

'ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా పదో తరగతి విద్యార్థులకు పార్టీ రంగులున్న సామగ్రి ఇచ్చి పార్టీ ప్రచారానికి వాడుకోవడం సరికాదు. ఈ అంశంపై ఎన్నికల ప్రధానాధికారి స్పందించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి' అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి కోరారు. ఎన్నికల నగారా మోగినా వైసీపీ ఆగడాలు హద్దుమీరుతున్నాయన్నారు. వారికి సహకరించే అధికారులపై ఎన్నికల కమిషనుకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఈ ప్యాడ్లు తీసుకు రాకండి

పలమనేరు: ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫొటోలతో ఉన్న ప్యాడ్లతో సోమవారం పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ విషయమై ఎంఈవో లీలారాణిని వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి రావడంతో గూగుల్ మీట్ ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ నాయకుల ఫొటోలతో ఉన్న పరీక్షా సామగ్రిని తీసుకు వస్తే కేంద్రాల్లోకి అనుమతించొద్దని అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు.



ఎమ్మెల్యే పంపిణీ చేసిన ప్యాడ్‌తో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థి

బరితెగించారు

- అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

కుప్పం, మార్చి 18: మెడలో వైసీపీ కండువా వేసుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఈ వ్యక్తిని చూశారా? ఇతడు జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో గుడుపల్లె మండలం చీకటిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్. ఎన్నికల నియమావళి ప్రకారం ఏ పార్టీ తరపునా ప్రచారాల్లో పాల్గొనకూడదు. కానీ, ఏమాత్రం జంకూగొంకూ లేకుండా వైసీపీ కండువా మెడలో వేసుకుని ఆ పార్టీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మండల కేంద్రమైన గుడుపల్లె పంచాయతీలోని కాడేపల్లె గ్రామంలో సోమవారం ఎంపీపీ వరలక్ష్మి, జడ్పీటీసీ కృష్ణమూర్తితో కలిసి ఇంటింటికీ తిరిగి వైసీపీ కరపత్రాలు పంచారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా, పంచాయతీ స్థాయి ఉద్యోగులు ఇలా బరితెగిస్తున్నారు.



జడ్పీటీసీతో కలిసి మెడలో పార్టీ కండువాతో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రచారం

వైసీపీ ప్రతినిధిగా టెక్నికల్ అసిస్టెంట్..

కుప్పం నియోజకవర్గ ఎన్నికల అధికారిగా ఆర్డీవో శ్రీనివాసులు సోమవారం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. దీనికి ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మురుగేశ్ వైసీపీ తరపున ప్రతినిధిగా పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఇలా అధికార పార్టీ తరపున ఒక టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నాసరే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు దారితీసింది. కుప్పం మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా మురుగేశ్ పనిచేస్తూ, వైసీపీ ఎమ్మెల్సీ భరత్ పీఏగా కూడా వ్యవహరిస్తున్నారు. దీనిపై ఉపాధి హామీ ఏపీవో గుణశేఖర్‌ను వివరణ కోరగా, కుప్పం మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉన్న మురుగేశ్ డిప్యుటేషన్ మీద ఎమ్మెల్సీ భరత్ పీఏగా వెళ్లారన్నారు. అందువల్ల పంచాయతీలు ఏవీ ఆయనకు కేటాయించలేదని చెప్పారు.



రాజకీయ పార్టీల సమావేశంలో పాల్గొన్న టెక్నికల్ అసిస్టెంట్ మురుగేశ్



వైసీపీ అధిష్ఠానానికి నగరి అసమ్మతి నేతల ఝలక్

సీఎంవో పిలుపుతో తాడేపల్లిలో రోజంతా పడిగాపులు

మంత్రి సమక్షంలో మాట్లాడతామనడంతో ఒళ్ళు మండి తిరుగు ప్రయాణం

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో హేమాహేమీల్లాంటి నేతలకు కూడా ఝలక్ ఇస్తున్న అధినేతకే ఆ పార్టీకి చెందిన నగరి నియోజకవర్గ అసమ్మతి నేతలు ఝలక్ ఇచ్చారు.మంత్రి రోజాను నగరి నియోజకవర్గంలో పలువురు మండల స్థాయి వైసీపీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. రోజాకు టికెట్ ఇవ్వొద్దని వారు ఎంతోకాలంగా అధిష్ఠానాన్ని కోరుతూ వచ్చారు. ఒకవేళ టికెట్ ఇచ్చినా ఓడిస్తామని హెచ్చరికలు కూడా చేశారు. అయితే అభ్యర్థిని ప్రకటిస్తే అంతా సర్దుకుపోతుందని భావించిన అధిష్ఠానం వీరిని సంప్రదించకుండానే రోజాకే టికెట్ ప్రకటించింది.అయితే అసమ్మతి వర్గం రాజీ పడకపోగా మళ్ళీ మీడియా సమావేశం పెట్టి తమ నిర్ణయంలో మార్పులేదని వెల్లడించారు. ఈ పరిణామంతో ఆందోళన చెందిన అధిష్ఠానం సర్దుబాటుకు ఉపక్రమించింది. ఆదివారం మధ్యాహ్నం అసమ్మతి వర్గ నేతలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నుంచీ కబురు వచ్చింది. సోమవారం ఉదయం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి రావాలని కోరారు. దీంతో అసమ్మతి వర్గ నేతలైన శ్రీశైల దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు భాస్కర రెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి, నిండ్ర జడ్పీటీసీ మల్లీశ్వరి భర్త పరంధామయ్య, ఆ మండల వైసీపీ మాజీ కన్వీనర్ మనోహర నాయుడు, సర్పంచ్ జయ్‌రెడ్డి, పుత్తూరు మాజీ ఎంపీపీ ఏలుమలై , పార్టీ నేతలు రవిశేఖర్ రాజు, ప్రతాప్, నారాయణబాబు తదితరులు ఆదివారం రాత్రే తాడేపల్లి బయల్దేరి వెళ్ళారు. అయితే సోమవారం ఉదయం సీఎం క్యాంపు కార్యాలయం నుంచీ పిలుపు రాలేదు. సీఎం బిజీగా వున్నారని మధ్యాహ్నం తర్వాత పిలుస్తారన్న సమాచారం వచ్చింది. సాయంత్రమైనా అపాయింట్‌మెంట్ దొరకలేదు. రోజంతా పడిగాపులు పడ్డాక ఈరోజు కలవడం కుదరదని చెప్పడంతో పాటు మంత్రిని కూడా పిలిపిస్తున్నారని, మంగళవారం ఉదయం మంత్రి సమక్షంలోనే మాట్లాడతారన్న సమాధానం వచ్చింది. దీంతో అసమ్మతి నేతలకు చిర్రెత్తుకొచ్చింది. అధిష్ఠానం మీద గౌరవంతో వస్తే ఇలా చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము వ్యతిరేకిస్తున్న వారితో కలసి సమావేశంలో కూర్చునే ప్రసక్తే లేదని, అధినేత ఆదేశాలను ధిక్కరించినందుకు తమపై ఏ చర్యలు తీసుకున్నా పర్వాలేదని తెగేసి చెప్పి వెంటనే తిరుగు ప్రయాణమయ్యారు.

తెర వెనుక జరిగిందేమిటంటే...

నగరి అసమ్మతి వర్గ నేతలను అధిష్ఠానం తాడేపల్లి పిలిపించినట్టు తెలియని మంత్రి సోమవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డిని కలిసినట్టు తెలిసింది. నగరిలో తనను వ్యతిరేకిస్తున్న నాయకులను పిలిపించి రాజీ కుదర్చాలని పెద్దిరెడ్డిని అభ్యర్థించారని... దానికి పిలిపించడానికి వారు నియోజకవర్గంలో వుంటే కదా... అధిష్ఠానం నుంచీ పిలుపు రావడంతో తాడేపల్లి వెళ్ళారని పెద్దిరెడ్డి సమాధానమిచ్చినట్టు సమాచారం. దీంతో ఖంగు తిన్న మంత్రి వెంటనే తాడేపల్లిలో ముఖ్యులతో మాట్లాడి సోమవారం అసమ్మతి నేతలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా ఆపించారని, మంగళవారం తన సమక్షంలోనే వారితో మాట్లాడేలా ఏర్పాటు చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. మంత్రి రోజా సమక్షంలో అధినేతతో సమావేశం కావడానికి కూడా అసమ్మతి నేతలు అంగీకరించనంతగా ఇరువర్గాల నడుమా అగాధం ఏర్పడిన నేపథ్యంలో దాన్ని పూడ్చడానికి అధిష్ఠానం యత్నిస్తుందో లేక ధిక్కరించి వెళ్ళిన నేతలపై చర్యలు తీసుకుంటుందో అన్నది వేచి చూడాల్సి వుంది. అసమ్మతి నేతలను పట్టించుకోకపోతే వారి కార్యాచరణ ఎలా వుంటుందన్నది ఇపుడు ఆసక్తికరంగా మారుతోంది. నువ్వా నేనా అన్నట్టు పోటాపోటీ రాజకీయాలు నడిచే నగరిలో ఎవరు గెలిచినా స్వల్ప ఆధిక్యంతోనే అన్నది తెలిసిందే. ఆ నేపథ్యంలో మండలాల్లో ప్రజాబలమున్న అసమ్మతి నేతలు దూరమైతే వైసీపీకి కోలుకోలేని దెబ్బ పడడం ఖాయం.

మున్సిపాలిటీలపై మరో భారం!

- కార్మికులకు ఆరోగ్యభత్యం చెల్లించాలన్న ప్రభుత్వం
- ఆ తర్వాత బిల్లులు ఇస్తామని ప్రకటన
- ఈ మాట నమ్మలేమంటున్న స్థానిక సంస్థలు

చిత్తూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు ఆరోగ్యభత్యం చెల్లింపుపై ప్రభుత్వం మున్సిపాలిటీలపైనే భారం వేసింది. జీతాలతో కలిపి కార్మికులకు చెల్లించాక.. ఆ తర్వాత బిల్లులు పెట్టుకోవాలని సూచించింది. కేంద్రం ఇచ్చిన నిధుల్నే తమకు ఇవ్వని ప్రభుత్వం.. ఈ రూ.6 వేల ఆరోగ్య భత్యం తర్వాత ఇస్తుందంటే నమ్మశక్యంగా లేదని మున్సిపల్ పాలకవర్గాలు అంటున్నాయి. అది తమపై భారమేనని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. దీనివల్ల జిల్లాలోని ఓ నగర, నాలుగు పురపాలికలకు ఏడాదికి రూ.7.09 కోట్ల భారం పడనుంది.

జిల్లాలోని చిత్తూరు నగరపాలక సంస్థ, కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి మున్సిపాలిటీల్లో 985 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా దాదాపు పొరుగు సేవల ఉద్యోగులే. వీరికి నెలకు రూ.6 వేలు చొప్పున ఆరోగ్య భత్యాన్ని చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వాలూ మున్సిపాలిటీలతో సంబంధం లేకుండా, నేరుగా ఆ మొత్తాన్ని చెల్లించాయి. సీఎం జగన్ ఆ మధ్య నిలిపేయడంతో కార్మికులు ఆందోళనకు దిగారు. దీంతో మళ్లీ పునరుద్ధరించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఈ ఏడాది జనవరిలో పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మె చేశారు. కార్మిక సంఘాలతో నిర్వహించిన చర్చల్లో.. ఇక నుంచి ఆరోగ్యభత్యంతో కలిపి కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీనిచ్చింది. కేటగిరీ-1 కార్మికులకు ఆరోగ్యభత్యంతో కలిపి రూ.24,500.. కేటగిరీ-2 కార్మికులకు ఆరోగ్యభత్యంతో కలిసి రూ.21 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆరోగ్య భత్యంతో కలిపి వేతనాలను మున్సిపాలిటీలే చెల్లించాలని ప్రభుత్వం తాజాగా జీవో 36ను విడుదల చేసింది. ఒక్కొక్కరికి రూ.6 వేల వంతున 985 మందికి నెలకు రూ.59.10 లక్షలు.. ఏడాదికి రూ.7.09 కోట్లను ముందుగా మున్సిపాలిటీలే చెల్లించాలన్న మాట. ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఆస్తి పన్ను ద్వారా సమకూరే సాధారణ నిధుల్ని అందుకు వెచ్చించాల్సి వస్తోంది. సాధారణంగా మున్సిపాలిటీలకు ప్రతి నెలా ఆరోగ్యభత్యం మొత్తాన్ని ప్రభుత్వం మొదటే విడుదల చేస్తే, కార్మికులకు జీతాలతో కలిపి ఇవ్వడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు విరుద్ధంగా కార్మికులకు మున్సిపాలిటీలే ఆరోగ్యభత్యాన్ని చెల్లించి, ఆ తర్వాత బిల్లులు పెడితే ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని జీవో 36లో పేర్కొన్నారు. దీంతో అధికారులు ఆశ్చర్యపోతున్నారు. కేంద్రం ఇచ్చే నిధుల్నే ఇవ్వకుండా మున్సిపాలిటీలను ఇబ్బంది పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. కార్మికులకు ముందే ఆరోగ్యభత్యం చెల్లిస్తే, ఆ తర్వాత ఇస్తామనడం నమ్మేట్టు లేదని అంటున్నారు. ఈ భారాన్ని మున్సిపాలిటీలే భరించక తప్పదని ఆందోళన చెందుతున్నారు.


పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య భత్యం ఇలా

మున్సిపాలిటీ	కార్మికుల సంఖ్య	ఏటా భారం (రూ.ల్లో)
చిత్తూరు	535	3,85,20,000
పలమనేరు	140	1,00,80,000
పుంగనూరు	135	97,20,000
నగరి	97	69,84,000
కుప్పం	78	56,16,000
మొత్తం	985	7,09,20,000

పరీక్ష రాసి.. ఈతకెళ్లి

- బావిలో మునిగిపోయి టెన్త్ విద్యార్థి మృతి

బైరెడ్డిపల్లె, మార్చి 18 : పదో తరగతి పరీక్ష రాసి వచ్చి సరదాగా స్నేహితులతో కలసి ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి బావిలో మునిగిపోయి మృతిచెందిన విషాదకర ఘటన బైరెడ్డిపల్లె మండలంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... గడ్డూరు గ్రామానికి చెందిన జయప్ప కుమారుడు మహేష్ కమ్మనపల్లె ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో మహేష్ పరీక్షరాసి ఇంటికొచ్చాడు. మధ్యాహ్నం స్నేహితులతో కలసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు ఈతకు వెళ్లారు. ఈత రాకపోవడంతో అకస్మాత్తుగా నీటిలో మునిగిపోయి మృతిచెందాడు. మొదటిరోజు ఉత్సాహంగా పరీక్షరాసి వచ్చిన విద్యార్థి తిరిగిరాని లోకాలను వెళ్లిపోవడంతో కుటుంబీకులు శోక సంద్రంలో మునిగిపోయారు. విద్యార్థి మృతితో గడ్డూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



మహేష్ (ఫైల్ ఫొటో)

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం):సా. 6.29

సహరి బుధవారం) : ఉ. 4.58

'ఓపెన్'గా పరీక్షలు..!

- చిత్తూరులో మాస్ కాపీయింగ్
- డీఈవోతో చర్చించి చర్యలు తీసుకుంటామన్న అధికారి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 18: ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షల్లో టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ పెద్ద ఎత్తున సాగింది. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. కొద్దిసేపటికే చిత్తూరులోని బీఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాస్ కాపీయింగ్ సాగినట్లు విమర్శలు వచ్చాయి. ప్రైవేటు సెంటర్ల నిర్వాహకులు ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారం జవాబు పత్రాల జిరాక్స్ కాపీలను కిటికీల గుండా విద్యార్థులకు అందజేశారు. పరీక్షా కేంద్రాల గదుల బయటే పుస్తకాలు ఇబ్బడిముబ్బడిగా ఉన్నా, ఇన్విజిలేటర్లు ఏ మాత్రం పట్టించుకోలేదు. పాస్ చేస్తామంటూ ఓపెన్ స్కూల్ ప్రైవేటు.. ప్రభుత్వ సెంటర్ల నిర్వాహకుల్లో కొందరు విద్యార్థుల నుంచి కొంత మొత్తం వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. విద్యార్థులు పరీక్షలు హాజరు కాకున్నా, వారి స్థానంలో మరొకరి ద్వారా పరీక్షలు రాయించారనే విమర్శలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. మాస్ కాపీయింగ్‌పై డీఈవో దేవరాజును వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు. విద్యాశాఖ పరీక్షల విభాగం సహాయ కమిషనర్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ చాముండేశ్వరిని వివరణ కోరగా, మాస్ కాపీయింగ్ జరిగిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై డీఈవోతో చర్చించి ఆ కేంద్రం నిర్వాహకులు, సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలకు 1035 మంది విద్యార్థులకు గాను 959 మంది హాజరుకాగా, 76 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్‌లో 3679 మందికి గాను 3546 మంది హాజరు కాగా 133 గైర్హాజరైనట్లు ఆమె వివరించారు.

ఒంటిపూట బడులు ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్): ఎండ తీవ్రత దృష్ట్యా సోమవారం నుంచి జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఒంటి పూటబడులు ప్రారంభమయ్యాయి. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరిగాయి. టెన్త్ పరీక్షా కేంద్రాలున్న జిల్లాలోని 116 పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5.10 గంటల వరకు కొనసాగింది.

మొదలైన ఇంటర్ మూల్యాంకనం

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సోమవారంతో ముగియగా, ఉర్దూ మాడ్రన్ లాంగ్వేజ్ పరీక్షలు పలమనేరు, వి.కోట ప్రభుత్వ కళాశాలల్లో మంగళ, బుధవారాల్లో జరగనున్నాయి. ఈ క్రమంలో ఇంగ్లీష్, తెలుగు, హిందీ, గణితం, పౌరశాస్త్రం సబ్జెక్టు జవాబు పత్రాల మూల్యాంకనం చిత్తూరులోని పీసీఆర్ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రారంభమైయాయి. 44 మంది ముఖ్య పరీక్షకులు, 224 మంది సహాయ పరీక్షకులు విధి నిర్వహణలో పాల్గొన్నారని డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు.

టీడీపీ నేతపై అకారణ దాడి

మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరిపై బీసీ సెల్ అధ్యక్షుడి ఫిర్యాదు - పుత్తూరులో ఉద్రిక్త పరిస్థితులు

పుత్తూరు అర్బన్, మార్చి 18: టీడీపీ చిత్తూరు పార్ల మెంట్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డిపై పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి, అతని అనుచరుడు పి. సునీల్ సోమవారం సాయంత్రం దాడికి పాల్పడ్డారు.ఈ విషయమై షణ్ముగరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రకారం... పట్టణంలోని చింతలగుంటలో తుడా నిధులతో పార్కు నిర్మాణ పనులు జరుగుతు న్నాయి. ఇందులో భాగంగా కాంపౌండ్ గోడ నిర్మించేందుకు పిల్లర్ల కోసం గుంతలు తీశారు. సోమవారం సాయంత్రం అటు వెళుతున్న షణ్ము గరెడ్డికి కుక్క పిల్ల అరుపు వినిపించ డంతో అటు వెళ్లి చూశాడు.పిల్లర్ల కోసం తీసిన గుంతలో కుక్కపిల్ల పడి పోయి ఉండడంతో పైకి తీసుకువచ్చే ప్రయత్నం చేశాడు. ఇంతలో అటు వచ్చిన మున్సిపల్ చైర్మ న్ ఆనంగి హరి, అతని అనుచరుడు పి.సునీల్ పనులకు సంబంధించిన ఫొటోలు తీస్తున్నాడని షణ్ముగరెడ్డిపై దాడి చేశారు. తాను కుక్కపిల్లను బయటకు తీస్తున్నానని చెబు తున్నా వినకుండా రాళ్లతో తనపై దాడి చేశారని , గతంలో కూడా హరి, అతని అనుచ రులు తనపై హత్యాయత్నా నికి పాల్పడ్డా రని ఫిర్యా దులో షణ్ముగరెడ్డి పేర్కొ న్నాడు.ఈ దాడి విషయం తెలియడంతో టీడీపీ శ్రేణులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని హరిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టాయి.అదే సమయంలో హరి తన అనుచరులతో స్టేషన్‌కు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అరుపులు, కేకలతో స్టేషన్ పరిసరాలు దద్దరిల్లాయి. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో పోలీ సులు లాఠీలు ఝులిపించాల్సి వచ్చింది. దీంతో పుత్తూ రులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.





పోలీస్ స్టేషన్ బయట గుమికూడిన టీడీపీ శ్రేణులు - (ఇన్‌సెట్లో) పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న షణ్ముగరెడ్డి తదితరులు

టీడీపీలో చేరాడని..!

- చిత్తూరులో వైసీపీ నేతల దాడి
- ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు

చిత్తూరు, మార్చి 18: ఎన్నికలు సమీపిస్తున్న నేప థ్యంలో టీడీపీలో చేరడాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోయారు. ఈ క్రమంలో ఆటోలను సీరియల్‌లో పెట్టే విషయంలో తలెత్తిన వివాదంలో రాళ్ల దాడికి దిగారు. ఈ ఘర్షణలో టీడీపీ కార్యకర్త నవీన్ గాయపడ్డారు. వివరా ల్లోకి వెళితే.. చిత్తూరు మురకంబట్టులో ఆదివారం కొన్ని కుటుంబాలు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ విషయాన్ని మురకంబ ట్టులో అధికారాన్ని చెలాయిస్తున్న వైసీపీ నాయకుడు చిన్ని జీర్ణించుకోలేకపోయారు. తమను కాదని టీడీపీలో ఎలా చేరతారని నవీన్, అతడి బంధువులను బెదిరిం చారు. ఈ నేపథ్యంలో సోమవారం కూడా మురకంబట్టు ఆటోస్టాండ్ వద్ద నవీన్ అన్న దామోదరం, చిన్ని అనుచ రుడు మురగేశ్ మధ్య ఆటోలను సీరియల్‌లో పెట్టుకునే క్రమంలో ఘర్షణ తలెత్తింది. దాంతో దామోదరం తన తమ్ముడైన నవీన్‌కు ఫోన్ చేసి పిలిపించారు. నవీన్ ఆటో స్టాండ్ వద్దకు రాగానే.. చిన్ని వర్గీయులు నవీన్‌పై, అతని బంధువులపై ఇటుక రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో నవీన్, మురుగేశ్‌కు గాయాలయ్యాయి. గాయప డిన వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయాలపాలైన టీడీపీ కార్యకర్త నవీన్‌ను టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్, మాజీ మేయర్ కఠారి హేమ లత, టీడీపీ నేతలు కాజూరు బాలాజీ, ఇతర నేతలు పరా మర్శించారు. కాగా, ఈ ఘటనపై ఇరువర్గాలపై పోలీ సులు కేసులు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి తెలిపారు.



గాయాలపాలైన నవీన్‌ను పరామర్శిస్తున్న గురజాల జగన్‌మోహన్

వ్యక్తిగత దాడులకు పాల్పడితే సహించం: గురజాల

ఎన్నికలను ఎన్నికలుగానే చూడాలని, వ్యక్తిగత దాడు లకు పాల్పడితే సహించేది లేదని గురజాల జగన్మోహన్ హెచ్చరించారు. నవీన్‌ను ఆస్పత్రిలో పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీలో చేరడాన్ని జీర్ణించుకోలేని వైసీపీ స్థానిక నాయకుడు చిన్ని, అతని వర్గీయులు దాడికి పాల్పడటం సరికాదన్నారు. ఈ రోజు అధికారంలోకి ఒకరుంటారని, రేపు మరొకరు ఉంటారన్న విషయాన్ని వైసీపీ నేతలు గుర్తించుకోవాల న్నారు.

టెన్త్ పరీక్షల్లో నిబంధనలు గాలికి..!

- పరీక్షా కేంద్రాల వద్ద తెరిచి ఉంచిన జెరాక్స్ కేంద్రాలు
- అమలుకాని 144 సెక్షన్







కృష్ణవేణి కళాశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు - గిరింపేట శివాలయంలో విద్యార్థుల పూజలు - విద్యార్థులను తనిఖీ చేసి పంపుతున్న సిబ్బంది

చిత్తూరు (సెంట్రల్), మార్చి 18: జిల్లాలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు సోమ వారం ప్రారంభమయ్యాయి. చిత్తూరులో తొలిరోజున కొన్ని నిబంధన లను గాలికి వదిలేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఎందుకంటే.. పరీక్షా కేంద్రాల సమీపంలో జెరాక్స్ కేంద్రాలను మూసివేయించడంలో విద్యా శాఖ అధికారులు విఫలయ్యారు. ఉదయం నుంచీ ఈ కేంద్రాలు యథా విధిగా పనిచేశాయి. 144 సెక్షన్ అమల్లోనూ ఉదాసీనంగా వ్యవహరిం చారు. గతేడాది పరీక్షా కేంద్రాలకు కనీసం 200 మీటర్ల దూరంలో ఏ ఒక్కరూ ఉండకుండా చర్యలు చేపట్టారు. ఇప్పుడేమో పరీక్ష జరిగేంత వరకు కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రైవేటు పాఠశా లల ఉపాధ్యాయులు గుంపులుగా ఉన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫో న్లను తీసుకెళ్లడంపైనా పెద్దగా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఇక, పెద్ద సంఖ్యలో ఇన్విజిలేటర్లు పరీక్షల విధులకు హాజరు కాలేదు. దీంతో రిజర్వులోని ఇన్విజిలేటర్లకు హుటాహుటిన విధులు కేటాయిం చారు. తొలి రోజు జరిగిన తెలుగు పరీక్షకు 21757 మంది విద్యార్థులకు గాను 21156 మంది హాజరుకాగా, 601 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు. తొలి రోజు కావడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమీపంలోని దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. పలువురు విద్యా ర్థులు తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లారు. తమ పిల్లలు పరీక్ష రాస్తున్నంత సేపు.. వారి తల్లిదండ్రులు ఆయా కేంద్రాల బయట టెన్షన్‌తో గడిపారు.



మున్సిపల్ స్కూల్ వద్ద హాల్‌టికెట్ నెంబర్లు చూస్తున్న విద్యార్థులు

ఆత్మహత్య చేసుకుంటానంటే పెళ్లి చేసుకున్నా

- అత్తింటికెళితే అర్ధరాత్రి గెంటేశారు
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

బంగారుపాళ్యం, మార్చి 18: 'ప్రేమించానంటూ వెంటబడ్డాడు. పెళ్లి చేసుకోకుంటే నిన్ను చంపేసి, నేనూ ఆత్మహత్య చేసుకుంటాన న్నాడు. చివరకు పెళ్లి చేసుకుని భర్త తో కలిసి అత్తింటికి వెళితే వారేమో అర్ధరాత్రి అని కూడా చూడకుండా ఇంటి నుంచి గెంటే శారు' అని పోలీసులకు బాధితు రాలు ఫిర్యాదు చేశారు. పోలీ సులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలం పాలేరు పంచా యతీ శేషాపురానికి చెందిన బాబు కుమార్తె యమున ఓ ప్రైవేటు డిగ్రీ కళాశా లలో చదువు ముగించింది. అదే కళాశాలలో అదే పంచాయతీ మోతకుంటకు చెందిన శేఖర్ కుమారుడు అభిరామ్ (లోకరాజ్) చదువుకున్నాడు. ఆ సమ యంలో ప్రేమించానంటూ యమున వెంటపడేవాడు. ఆ తర్వాత 'పెళ్లి చేసుకో కుంటే నిన్ను చంపి, నేను కూడా ఆత్మహత్య చేసుకుంటా' అని బెదిరించేవాడు. ఈనేపథ్యంలో యమునను ఈనెల ఆరో తేదీ రాత్రి ఓ కారులో తమిళనాడు రాష్ట్రం అరుణాచలం తీసుకెళ్లి అక్కడ ఓ దేవాలయంలో తాళికట్టాడు. అదేరోజు రాత్రి మోతకుంటలోని తన స్వగృహానికి భార్యను తీసుకెళ్లాడు. అయితే అతడి తల్లిదండ్రులు ఈ పెళ్లిని అంగీకరించలేదు. మెడలోని తాళిని తెంచేసి, యమున వద్ద ఉన్న బంగారం, ఫోన్‌ను లాక్కొని, ఇంటినుంచి గెంటేశారు. అభిరామ్ తండ్రి శేఖర్, అతని కుమారులు కృష్ణ, అనిల్ వారి ద్విచక్రవాహనంలో అదే రోజు అర్ధ రాత్రి ఒంటిగంట ప్రాంతంలో శేషాపురం వద్ద రోడ్డుపై వదిలేశారు. దాంతో పుట్టింటికి వెళ్లడానికి భయపడిన ఆమె మదనపల్లెలోని తన స్నేహితురాలి వద్దకు వెళ్లిపోయింది. భర్తకు ఫోన్ చేయగా, ఎంతకూ సమాధానం రాకపోవ డంతో సోమవారం బంగారుపాళ్యం పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. అభిరామ్, అతని తల్లిదండ్రులు నాగభూషణమ్మ, శేఖర్, సోదరులు కృష్ణ, అని ల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.



యమున, అభిరామ్

నాకు చిత్తూరు కంటే

పుంగనూరే ముఖ్యం!

- చల్లా రామచంద్రారెడ్డితో సీకే బాబు

పుంగనూరు, మార్చి 18: తనకు చిత్తూరు ఎన్నికల కంటే పుంగనూరులో టీడీపీ గెలుపే ముఖ్యమని, ఎప్పుడు పిలిచినా ఎన్నికల ప్రచారా నికి వస్తానని మాజీ ఎమ్మెల్యే సీకే బాబు చెప్పి నట్లు తెలిసింది. చిత్తూరులో సోమవారం సీకేబాబును పుంగనూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి (చల్లా బాబు) కలిసి ఎన్నిక లపై చర్చించారు. పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓటమే తన ధ్యేయమని, అందుకోసం ఎప్పుడు పిలిచినా వచ్చి ప్రచారం చేయడా నికి సిద్ధమని ఆయన చెప్పినట్లు సమాచారం. పెద్దిరెడ్డిని ఓడించడానికి తన సపోర్టు ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరలోనే పుంగనూరు పర్యట నకు ఆహ్వానిస్తానని చల్లా బాబు చెప్పారు.



సీకే బాబుతో మాట్లాడుతున్న చల్లా బాబు

కాగా, 1985 నుంచీ పెద్దిరెడ్డి, సీకే మధ్య వైరం కొనసాగుతున్నట్లు రాజ కీయ వర్గాలు చెబుతున్నాయి. చిత్తూరులో గోపీనాథ్‌కు, సీకే బాబుకు మధ్య గతంలో రాజకీయ విభేదాలుండేవి. గోపీనాథ్‌కు అప్పట్లో పీలేరు ఎమ్మెల్యేగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మద్దతు ఉండేది. సీకే, పెద్దిరెడ్డి మధ్య వైరా నికి ఇదీ ఓ కారణమని తెలుస్తోంది. ఇక, కాంగ్రెస్ పార్టీలో వర్గరాజకీయాల నేపథ్యంలో సీకే బాబుతో మాజీ సీఎంలు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, నల్లారి కిర ణ్‌కుమార్‌రెడ్డి సన్నిహితంగా ఉండేవారు. గతంలో చిత్తూరులో జిల్లా కాంగ్రెస్ సమావేశానికి వచ్చిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వారి అనుచరు లను సీకే బాబు అనుచరులు గొడవచేసి అడ్డుకున్నారు. అప్పట్నుంచి వీరి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. అందుకనే సీకే బాబు వైసీపీలో చేరడాన్ని పెద్దిరెడ్డి అడ్డుకున్నట్లు ప్రచారం ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకుని సీకే బాబును చల్లా బాబు కలిసి ప్రచారానికి ఆహ్వానించారని తెలుస్తోంది.

టీడీపీలోకి వెంకటరమణరాజు!

గతంలో పుంగనూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా రెండుసార్లు పోటీ చేసిన వెంకటరమణరాజు మళ్లీ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది. గత ఎన్నికలకు ముందు పుంగనూరు ఇన్‌చార్జిగా ఆయన స్థానంలో ఎన్.అనీషారెడ్డిని నియమించారు. దీంతో ఆయన వైసీపీలో చేరారు. కాగా, చల్లా రామచంద్రా రెడ్డి చొరవతో ఆయన మళ్లీ టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది. టీడీపీ అధి నేత చంద్రబాబు నాయుడు అపాయింట్‌మెంట్ ఇవ్వగానే ఆయనతో పాటు పలువురు వైసీపీ నేతలు పసుపు కండువా కప్పుకోనున్నట్లు సమాచారం.

ప్రభుత్వాస్పత్రికి వైసీపీ రంగుల మాటేమిటి?



ఆస్పత్రి గోడలకున్న వైసీపీ రంగులు

కార్వేటినగరం, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా కార్వేటిన గరం ప్రభుత్వ ఆస్పత్రి గోడలకు వైసీపీ రంగులు మాత్రం సోమవారం కూడా అలాగే ఉన్నాయి. ఎన్నికల నిబంధనలు అధికార పార్టీ రంగులకు వర్తించదా అని ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నాయి.

'కోడ్' అమలుకు సహకరించండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 18: ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమావేశంలో ఆయన ప్రసంగిం చారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద, బహి రంగ స్థలాల్లో అనుమతి లేకుండా రాజ కీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగులు, పోస్టర్లు, కటౌట్లు తక్షణం తొలగించాల న్నారు. లేదంటే మున్సిపల్, పంచాయతీ యంత్రాంగం తొలగిస్తుందని చెప్పారు. నిబంధనలకు లోబడి పార్టీ నేతలు ప్రచా రాల్లో పాల్గొనాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. టీడీపీ ప్రతినిధులు సురేంద్రకుమార్, కోదండ యాదవ్ మాట్లా డుతూ.. నిష్పక్షపాతంగా ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియో గించుకునే విధంగా ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. సమావేశంలో పి.భాస్కర్ (బీఎస్పీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), గంగరాజు (సీపీఎం), పరదేశి (కాంగ్రెస్), ఉదయ్‌కుమార్ (వైసీపీ) తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

ఎన్నికల విధులపై అవగాహన కల్గి ఉండాలి

తమకు కేటాయించిన ఎన్నికల విధులపై అధికారులంతా అవ గాహన కల్గి ఉండాలని కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాలులో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్యతో కలసి వివిధ బృందాల నోడల్ ఆఫీసర్లు, సహాయక సిబ్బందితో సమీక్షించారు. ఎన్నికలు సాఫీగా నిర్వహించడానికి 24 బృందాలతో కూడిన నోడల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలన్నీ జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌తో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. ఆర్వోల ద్వారా నిర్దేశిత సమయంలోగా నివేదికలను ఎన్నికల అధికారికి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి పంపించాలని చెప్పారు.

ఎస్వీ జూపార్కులో బెంగాల్ టైగర్ మృతి

మంగళం, మార్చి 18: శ్రీవెంకటేశ్వర జూపా ర్కులో 7 సంవత్సరాల 6 నెలల వయసు ఉన్న మగ బెంగాల్ టైగర్ ఆది వారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. 2016వ సంవత్సరంలో ఇక్కడే జన్మించిన ఈ పులి పుట్టుకతోనే కంటి జబ్బుతో బాధపడుతోంది. రెండు కళ్లు క నిపించకపోవంతో నిపు ణులైన వైద్యులతో చికిత్స అందిస్తున్నారు. కాగా ఈనెల 16న చికిత్స అందించడానికి ప్రయత్నించడంతో అది సహకరించలేదు. 17వ తేదీ రాత్రి 8.30 గంటలకు మృత్యువాతపడిందని, ఎస్వీ యూనివర్సిటీలో వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించా రని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. దాని మెదడులో హైపో ప్లాసిమా, హైడ్రో నస్రాప్రస్ లెడ్ టు నెఫ్రిట్స్ అనే వ్యాధితో చని పోయినట్లుగా వైద్యులు నిర్ధారించినట్లు పేర్కొన్నారు.



చనిపోయిన పులి (ఫైల్‌ఫొటో)

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం

సదుం, మార్చి 18: సదుంలో సోమవారం సాయంత్రం సాంకేతిక లోపంతో ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధమైంది. తన ఎలక్ట్రిక్ స్కూటరులో సదుం నుంచి తన మరదలు శ్రీనిత్య చెరు కువారిపల్లెకు వస్తున్నారని జ్యోతీశ్వర్‌రెడ్డి తెలిపారు. మార్గమధ్యంలో ఫోన్ కాల్ రావడంతో ఆపి పక్కకు వచ్చి మాట్లాడుతుండగా స్కూట ర్‌లో మంటలు చెలరేగి దగ్ధమైందన్నారు. దీనిని తాను 2022లో కొన్నట్లు చెప్పారు. గతంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తగా షోరూం నిర్వాహకులు పట్టించుకోలేదన్నారు. ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.



ఆటోను ఢీకొన్న మినీ లారీ

ఒకరి దుర్మరణం, మరొకరికి తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం, మార్చి 18: ఆటోను మినీ లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మరొకరికి తీవ్రగాయాల య్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ ఆర్‌పురం మండలం మంగుంట గ్రామానికి చెందిన కె.మునికృష్ణ (35), సుభాష్(44) 49.కొత్తపల్లె మిట్ట నుంచి ఇంటికి ఆటోలో బయల్దేరారు. మార్గమధ్యంలో సోమవారం రాత్రి సుమారు 9.30 గంటలకు చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై ఆరిమా కులపల్లె హైస్కూల్ వద్దకొచ్చేసరికి చిత్తూరు వైపు కోళ్ల లోడుతో వెళుతున్న మినీ లారీ ఢీకొట్టింది. ఆటో నుజ్జునుజ్జవగా అందులోని మునికృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, సుభాష్ తీవ్రంగా గాయప డ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తర లించారు. మినీ లారీ డ్రైవర్ పరారైనట్లు సమాచారం. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఆర్‌పురం ఎస్ఐ కుళాయప్ప తెలిపారు.





నుజ్జునుజ్జయిన ఆటో - ప్రమాదానికి కారణమైన మినీలారీ - ఇన్‌సెట్‌లో మునికృష్ణ (ఫైల్ ఫొటో)

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



కుప్పిగానిపల్లెలో గ్రామ సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గుడుపల్లె, మార్చి 18: మండలంలోని కుప్పిగానిపల్లెలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామ సచివాలయం ఎదుట గ్రామస్తులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కుప్పిగానిపల్లెలో కొన్ని నెలలుగా నీటి సమస్య ఉందని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీరును తీసుకొస్తున్నామని తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను తీర్చేందుకు చర్యలు తీసుకొని తమ దాహాన్ని తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

కల్లూరు, మార్చి 18: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ఏపీఎం మధుసూదన్ తెలిపారు. పులిచెర్లలో సోమవారం డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఓటుహక్కుపై ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఓటు వజ్రాయుధంలాంటిదని, తమకు నచ్చిన నేతను ఓటు ద్వారా ఎన్నుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరునమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు తేజోవతి, వసంత, వాహిద్ భాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

గుడుపల్లె, మార్చి 18: టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. సోమవారం కంచుబందార్లపల్లె, గుండ్లసాగరం పంచాయతీలలో టీడీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ...ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడం తప్ప సామాన్య ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. అసమర్థ ప్రభుత్వానికి ఇదే చివరి ఎన్నికలని తెలిపారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్‌తో అందరిలో వెలుగు నింపుతుందని తెలిపారు. ఇంటింటా వారు తిరిగి కరపత్రాలను పంచిపెట్టి చంద్రబాబుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బాబు నాయుడు, చంద్రశేఖర్, మునిరాజు, బేటప్పనాయుడు, హేమాంబర్ గౌడు, జనసేన మండలాధ్యక్షులు అమీర్, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, ఉదయ్ కుమార్, మున్నీరు, షణ్ముగం, ప్రకాష్, వెంకటేష్, ఎల్లప్ప, సుబ్బు, మంజునాథ్, భానుమూర్తి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ పనిచేయాలి



రొంపిచెర్లలో చల్లాబాబు సత్కరించిన కార్యకర్తలు

రొంపిచెర్ల, మార్చి 18: తెలుగుదేశం పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కసిగా పనిచేయాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. సోమవారం ఆయన ఇంటి వద్ద బోడిపాటివారిపల్లె పంచాయతీకి చెందిన పలువురు కార్యకర్తలు చల్లాబాబుకు శాలువ కప్పి సత్కరించారు. సుబ్రమణ్యం, కుమార్, ఉమాపతి, అమరనాథ్, ఆంజనేయులు, సుబ్రమణ్యంలు సమస్యలు చల్లాబాబు దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చింది.. ఇకపై ఏ కేసులకు బయపడవలసిన పనిలేదని, 56 రోజులు పార్టీ కోసం పనిచేస్తే మన కష్టాలు తీరుతాయని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, నాగార్జుననాయుడు పాల్గొన్నారు.

మహాశక్తి గురించి ఇంటింటా ప్రచారం చేయాలి

శాంతిపురం, మార్చి 18 : టీడీపీ మహాశక్తి పథకాల గురించి ఇంటింటా ప్రచారం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్ అన్నారు. సోమవారం మండల పార్టీ కార్యాలయంలో శాంతిపురం, రాళ్ళబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రచారంలో ఐదు సంవత్సరాలుగా వైసీపీ పాలనలో ప్రజలు పడిన కష్టాలు గురించి తెలపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయకుమార్, చంద్రశేఖర్, ఉదయకుమార్, నాగభూషణంరెడ్డి, మణి, గోపాల్, నారాయణస్వామి, రమేష్ రెడ్డి, మునిరెడ్డి, ప్రకాష్, బాలు, పెద్దన్న, భాస్కర్, శ్యామల పాల్గొన్నారు.

రామకుప్పం : మండల పరిధిలో టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైసీపీ ప్రజావ్యతిరేక పాలన వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు గంట్లరెడ్డి, వెంకటరమణ, విజయ్‌కుమార్‌రెడ్డి, కోదండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పుంగనూరు, మార్చి18: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయపార్టీల నాయకులు నిబంధనలు పాటించాలని పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన రాజకీయపార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 265 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీ సమావేశాలకు, సభలకు దూరంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే సస్పెండ్ కాక తప్పదని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమస్యలు వస్తే వెంటనే తనకు లేదా మండలస్థాయి ఎన్నికల అధికారులకు తెలియజేయాల్సివుందని వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, రాజకీయపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : ఉపాధి హామీ పథకం సిబ్బంది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలం ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి సోమవారం సర్క్యులర్ పంపిణీ చేశారు. సర్క్యులర్‌లో తెలిపిన వివరాల మేరకు... ఈనెల 16 నుంచి ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రచారంలో సిబ్బంది పాల్గొనరాదన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు వచ్చిన తక్షణం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భూతగాదాలో ముగ్గురికి స్వల్పగాయాలు





చికిత్స పొందుతున్న ఆంజప్ప, శ్రీనివాసులు

పుంగనూరు రూరల్, మార్చి18: భూతగాదాలో ఇరువర్గాలు దాడులకు పాల్పడడంతో ముగ్గురు స్వల్పంగా గాయపడి సోమవారం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పుంగనూరు మండలం మేలుందొడ్డికి చెందిన ఆంజప్ప, శ్రీనివాసులు పొలం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన చంద్రారెడ్డి, వెంకటరెడ్డి, యుగంధర్‌లు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఆంజప్ప, శ్రీనివాసులు, వెంకటరెడ్డిలు గాయపడి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చంద్రబాబును కలిసిన కుప్పం నేతలు



కుప్పం, మార్చి 18: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, కుప్పం నియోజకవర్గ ముస్లిం మైనారిటీ విభాగం అధ్యక్షుడు జాకీర్‌లు సోమవారం పార్టీ అధినేత చంద్రబాబును విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కుప్పంలో తాజా రాజకీయ పరిస్థితులను, ప్రచారం జరుగుతున్న తీరుని అధినేతకు వి వరించారు. లక్షఓట్ల మెజారిటీయే లక్ష్యంగా పనిచేయాలని చంద్రబాబు వారికి సూచించారు.

కుప్పం టౌన్ బ్యాంక్ ఛైర్మన్ పదవీకాలం పొడిగింపు

కుప్పం: కుప్పం పట్టణ సహకార బ్యాంకు ఛైర్మన్ భాగ్యరాజ్ ప్రభంజన్ పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 14తో ముగియనున్న పదవీ కాలాన్ని జులై 13వ తేదీ వరకు పొడిగిస్తూ ఇచ్చిన ఇచ్చిన ఉత్తర్వులు సోమవారం బ్యాంకుకు చేరాయి.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం





పుంగనూరులో హాల్‌టికెట్ల వివరాలు చూస్తున్న విద్యార్థులు,కుప్పం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కుప్పం, మార్చి 18: కుప్పంలో సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 9 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆర్‌పేట ఉన్నత పాఠశాలలో 201 మంది విద్యార్థులకుగాను 192 మంది పరీక్షలు చేశారు. అలాగే ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 300 మందికిగాను 294 మంది, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 250 మందికిగాను 248 మంది, విజయవాణి ఉన్నత పాఠశాలలో 240 మందికిగాను 232 మంది, చందం ఉన్నత పాఠశాలలో 176 మందికిగాను 169 మంది, పైపాళ్యం ఉన్నత పాఠశాలలో 127 మందికిగాను 122 మంది, నడిమూరు ఏపీఎంఎస్‌లో 162 మందికిగాను 153 మంది, అడవిబూదుగూరు ఉన్నత పాఠశాలలో 241 మందికిగాను 231 మంది, పొన్నాంగూరు ఉన్నత పాఠశాలలో 148 మందికిగాను 144 మంది పదో తరగతి పరీక్షలు రాశారు.



పలమనేరులో పరీక్ష కేంద్రానికి పరుగు తీస్తున్న విద్యార్థిని

పలమనేరు : మండలంలో 9 ప్రభుత్వ, 13 ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు 6 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాశారని ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం తెలిపారు. మొత్తం 1334మందికిగాను 1309 మంది పరీక్షలు రాశారన్నారు.

పుంగనూరు రూరల్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం పుంగనూరులో ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల కస్టోడియల్ అధికారి అశ్వర్ధనారాయణ, ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పుంగనూరులో మొత్తం 8 పరీక్షా కేంద్రాల్లో 1870మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సివుండగా 1778మంది హాజరు కాగా 92మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొదటి రోజు తెలుగు, ఉర్దూ, ప్రత్యేక తెలుగు పరీక్షలు జరిగాయి.

సదుం : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి తెలుగు పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు డిపార్టుమెంటల్ అధికారి సూర్యప్రకాశ్ తెలిపారు. మొత్తం 284 మంది హాజరు కావాల్సి ఉండగా 279 మంది హాజరైనట్లు ఆయన వివరించారు.

రొంపిచెర్ల : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలలో తెలుగుపరీక్షకు రెండు సెంటర్లలో 304 మంది పరీక్షకు హాజరు కావల్సివుండగా 10 మంది హాజరుకాలేదని ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. పరీక్ష చీఫ్‌లుగా వెంకట్రమణారెడ్డి, మంజువాణి, డిపార్టుమెంట్ అధికారులుగా సురేష్ బాబు, సైయద్‌సాహెబ్ వ్యవహరించారు.

సోమల : సోమల హైస్కూల్‌లో టెన్త్ పరీక్షలకు 100మంది గాను నలుగురు, కందూరు హైస్కూల్‌లో 108మందికి గాను ఒకరు, పెద్దఉప్పరపల్లె హైస్కూల్‌లో 149మందికి గాను 8మంది హాజరు కాలేదని ఎంఈవో శివరత్న తెలిపారు.

చౌడేపల్లె: చౌడేపల్లెతోపాటు చారాల, పుదిపట్ల, మర్రిమాకులపల్లె, మేకలచిన్నే పల్లె, కాటిపేరి, పరికిదొన, దాదేపల్లె, విజయవాణి హైస్కూళ్ల పరీక్ష కేంద్రాలలో మొత్తం 506 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో కేశవరెడ్డి తెలిపారు.

బైరెడ్డిపల్లె : మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలకు 645 మందికిగాను మొదటిరోజు 618మంది విద్యార్థులు హాజరయ్యారు. బైరెడ్డిపల్లె బాలుర, బాలికోన్నత పాఠశాలలు, కమ్మనపల్లె ఆదర్శ పాఠశాలను పదోతరగతి పరీక్షాకేంద్రాలుగా ఏర్పాటుచేశారు.

రామకుప్పం : చెల్దిగానిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు శాంతిపురంలో పరీక్షలు రాస్తుండగా, మిగిలిన 19 పాఠశాలలకు చెందిన 683 మంది విద్యార్థులు రామకుప్పం బాలుర ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ గురుకుల పాఠశాల, విజిలాపురం ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు రాశారు.

వి.కోట : పదో తరగతి పరీక్షలకు వి.కోట మండలంలో 1076 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రోజు 23 మంది గైర్హాజరయ్యారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఒకరి అరెస్టు

బైరెడ్డిపల్లె, మార్చి 18 : దేవదొడ్డి-తీర్థం రోడ్డుక్రాస్‌లో ఆదివారం సాయంత్రం ఓ కారులో కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా ఎస్‌ఐ కృష్ణయ్య, సిబ్బంది కలసి పట్టుకున్నట్లు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బైరెడ్డిపల్లె పోలీసులు ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా కారులో అక్రమంగా మద్యం తరలిస్తుండడాన్ని గుర్తించారన్నారు. దీంతో గంగవరం మండలం సరమట్లపల్లెకు చెందిన చెన్నారెడ్డిని అరెస్టు చేసి రూ.76,819 విలువచేసే 1920 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కారును సీజ్ చేసినట్లు చెప్పారు. ఇందులో ప్రమేయంవున్న మరో వ్యక్తి పోలీసులను చూసి పారిపోయాడని, అతడిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. గంగవరం సీఐ కృష్ణమోహన్, బైరెడ్డిపల్లె ఎస్‌ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడి అరెస్టు చూపెడుతున్న పోలీసులు

బిసానత్తం సమీపంలో...

గుడుపల్లె : మండలంలోని బిసానత్తం సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీలో కారులో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారు డ్రైవర్ పారిపోయాడు. కారులో 35 బాక్సుల కర్ణాటక మద్యం బయటపడింది. వీటి విలువ సమారు లక్ష వరకు ఉంటుందని వారు తెలిపారు. కారును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా శ్రీవారి ధ్వజారోహణం





శ్రీవారి ఆలయంలో ధ్వజారోహణ పూజలు చేస్తున్న టీటీడీ అర్చకులు, పుంగనూరు పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

పుంగనూరు రూరల్, మార్చి18: పుంగనూరు కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి ధ్వజారోహణాన్ని టీటీడీ వేదపండితులు వైభవంగా నిర్వహించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయాన్నే స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, తోమాల సేవ, అర్చన నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. టీటీడీ వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గరుడ చిత్రపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిరోహించి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగాలని పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను అలంకరించి పుష్పపల్లకిలో మంగళవాయిద్యాల మధ్య పెద్ద శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో వి.శాంతి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, కంకణబట్టర్ పృథ్వీరాజ్, శ్రీకాంత్, అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ళ స్థలాల కోసం మహిళల ధర్నా



మండల సచివాలయం ఆవరణలో ధర్నా చేస్తున్న మహిళలు

రామకుప్పం, మార్చి 18: రామకుప్పం పట్టణంలోని పలువురు మహిళలు సోమవారం మండల సచివాలయం ఆవరణలో ధర్నాకు దిగారు. సుదీర్ఘకాలంగా రామకుప్పంలో అద్దె ఇళ్ళలో ఉంటున్న తాము ఇళ్ళ స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేస్తామన్న వైసీపీ నేతల మాటలు విని 2019 ఎన్నికలతోపాటు ఆపై జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి ఓటు వేశామన్నారు. నాలుగేళ్ళుగా తమకు ఇళ్ళ పట్టాలు ఇస్తామని, పక్కా గృహాలు మంజూరు చేస్తామని వైసీపీ నేతలు తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొందరికి మాత్రమే ఇళ్ళపట్టాలు మంజూరు చేశారన్నారు. నిరుపేదలైన తమకు పట్టాలివ్వకుండా మొండిచెయ్యి చూపారన్నారు. ఎమ్మెల్సీ భరత్‌కు ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని చెప్పి చేయలేదని వారు మండిపడ్డారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండల సచివాలయ ఆవరణలోనే బైఠాయించారు. కుప్పం సమావేశానికి వెళ్ళిన రెవెన్యూ అధికారులు ఎంతకూ రాకపోవడంతో మహిళలు వారి ఆందోళనను విరమించి ఇళ్ళకు వెళ్ళిపోయారు.

నలగుండ్రాయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బైరెడ్డిపల్లె, మార్చి 18 : కడపనత్తంలో వున్న నలగుండ్రాయస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం అంకురార్పణం, ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామికి అభిషేకంచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త మురళి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధం



మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి18 : జగన్‌రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు రాష్ట్రప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం స్థానిక నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్ప సభ విజయవంతం అయిందన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం తరలివచ్చి తమ మద్దతు తెలపడమే నిదర్శనమన్నారు. జగన్ పాలనలో ఆర్థిక దుర్వినియోగం, అవినీతికి మారుపేరుగా మారిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఖాజాపీర్, ఉమర్, నాగరాజు, మదన్, శ్రీధర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బైరెడ్డిపల్లె, మార్చి 18 : మండలంలో వివిధ పోలింగ్ కేంద్రాలను సోమవారం పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, గంగవరం సీఐ కృష్ణమోహన్ పరిశీలించారు. ఇందులో సమస్యాత్మక కేంద్రాల్లో చేపట్టాల్సిన చర్యల గురించి ఎస్‌ఐ కృష్ణయ్యకు తగు సూచనలిచ్చారు.

వైష్ణవిదేవి సేవలో అఘోర స్వాములు



చౌడేపల్లె, మార్చి18: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి అమ్మవారిని సోమవారం అఘోర స్వాములు దర్శించుకున్నారు. కాశీ నుంచి అఘోర స్వాములు ఐదురుగు రాగా వారికి ఆలయ నిర్వహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణిలు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చందంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

కుప్పం, మార్చి 18: చందం పంచాయతీలో కేఈసీ జాతీయ సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక శిబిరాన్ని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ బీసీ.నాగరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమారస్వామి, కొత్త ఇండ్లు ఆలయ ఛైర్మన్ షణ్ముగం, కేఈసీ సీఈవో సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు జే.మాధవన్, జి.గంగాధరం, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యగంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు



పలమనేరు, మార్చి18 : పలమనేరు పాతపేటలోని సత్యగంగమ్మ ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. చిత్తూరు టౌన్‌గ్రూప్ ఆలయాల ఈవో మునిశేఖర్ పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది. భక్తులు అమ్మవారికి కానుకల రూపంలో రూ. 1,12,505 లను హుండీలో నగదు రూపంలో వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు ఎండోమెంట్ సిబ్బంది విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ఐఆర్‌ఎంలో ఎంసెట్ కోచింగ్ ప్రారంభం

కుప్పం, మార్చి 18: కుప్పంలోని ఐఆర్‌ఎం కళాశాలలో సోమవారం కళాశాల ఛైర్మన్ బీఎం.దయానిధి ఎంసెట్ కోచింగ్‌ను ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ కుప్పంలోని విద్యార్థులకు స్థానికంగానే నాణ్యమైన కోచింగ్ ఇస్తున్నామన్నారు. ఈనెల 20వ తేదీనుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డి.లక్ష్మీకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అది కొనుగోలు చేసిన భూమి'

కుప్పం, మార్చి 18: కుప్పం మండలం మల్లానూరులో 10 ఎకరాల భూమిని తాను కొనుగోలు చేశానని జడ్పీటీసీ ఏడీఎస్.శరవణ తెలిపారు. కుప్పంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు చేసిన భూమిని తాను ఆక్రమించానంటూ తిరుమలేశ్ అనే వ్యక్తి అన్యాయంగా ఫిర్యాదు చేస్తున్నాడన్నారు. అంతేకాక అతను తనమీద పలుమార్లు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశానని చెప్పారు. అధికారులు స్పందించి తనకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

పోస్టర్ల తొలగింపు



సోమల, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పలు చోట్ల పలు పార్టీల పోస్టర్లను తొలగించకపోవడంతో పంచాయతీ కార్మికులతో వాటిని ఎంపీడీవో నారాయణ, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి చొరవ తీసుకుని తొలగింపులకు శ్రీకారం చుట్టారు. సోమవారం చిన్నఉప్పరపల్లె, కమ్మపల్లె, గట్టువారిపల్లె తదితర ప్రాంతాల్లోని బస్‌షెల్టర్లలో వివిధ పార్టీల వారి గోడ పత్రికలు తొలగించారు. పలు సచివాలయాలను అధికారులు సందర్శించి సీఎం ఫొటోలు, శిలాఫలకాలపై ముసుగులు వేయించారు.

రేపటి నుంచి మహాభారత యజ్ఞం

కల్లూరు, మార్చి 18: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీ ఎలకబైలు-కురవపల్లి సమీపంలో బుధవారం నుంచి ఏప్రిల్ 3వ తేది వరకు మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. బుధవారం ఉదయం ధ్వజారోహణంతో వేడుకలు ప్రారంభమవుతాయని, ఏప్రిల్ 3న కీచక వధతో వేడుకలు ముగుస్తాయన్నారు. భాగవతారిణి పూర్ణిమ పగటి వేళ కథ వినిపిస్తారని నిర్వహకులు తెలిపారు.

ఆవులపల్లెలో శ్రీవారి ఊరేగింపు



సోమల, మార్చి 18: ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో సోమవారం వఃూలవిరాట్‌కు విశేష అలంకరణ చేశారు. ఉభయదారుల ఆధ్వర్యంలో ప్రాతఃకాల ఉత్సవ పూజలు జరిపారు. గోవింద మాల భక్తులచే స్వామి వార్ల ఉత్సవమూర్తులను ప్రాకారోత్సవం నిర్వహించారు. రాంపల్లె, వంగసానిపల్లి, కలమందలవారిపల్లె గ్రామస్తులు, బసిరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. హంస వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని పల్లకీలో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

మెనూ ప్రకారం భోజనం వండాలి

సోమల, మార్చి 18: బడుల్లో పిల్లకు మెనూ ప్రకారం భోజనం అందివ్వాలని ఎంఈవో శివరత్న కోరారు. సోమవారం చెన్నయ్యగారిపల్లె, అడుసుపల్లె, సోమల పాఠశాలలను ఆమె తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వేసవిలో విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎల్లయ్య, సుజాత, భారతి పాల్గొన్నారు.

సారా స్వాధీనం : ఇద్దరి అరెస్ట్

కల్లూరు, మార్చి 18: పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లి సమీపంలోని గౌరీ వంక వద్ద నాటుసారాను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గౌరీ వంక వద్దకు పోలీసులు చేరుకోగా 50 లీటర్ల నాటుసారాను తరలిస్తున్న వెంకటరమణ, రవిని అదుపులోకి తీసుకొని సారాను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించనట్లు ఎస్‌ఐ తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కల్లూరు, మార్చి 18: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి తెలిపారు. పులిచెర్లలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడంతోనే ఆరోగ్య సమాజ నిర్మాణం సాధ్యమన్నారు. పౌష్టికాహారంపై అంగన్‌వాడీలు గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలుపై కమిషనర్ పర్యవేక్షణ



చిత్తూరు, మార్చి 18: నగరంలో ఎన్నికల కోడ్ అమలుపై నగరపాలక కమిషనర్ అరుణ పర్యవేక్షించారు. నిబంధనలు పాటించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేసి రాజకీయ పరమైన పోస్టర్లు, బ్యానర్లను తొలగించారు. అనుమతి లేకుండా ఎక్కడైనా పోస్టర్లు, బ్యానర్లను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏసీపీ రామకృష్ణుడు, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద పారిశుధ్య పనుల పరిశీలన

రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని మసీదుల వద్ద పారిశుధ్యం, నీటి సరఫరా తదితరాలపై దృష్టి సారించాలని అధికారులను కమిషనర్ అరుణ ఆదేశించారు. సోమవారం సంతపేట, హైరోడ్డులో ఉన్న మసీదులను ఆమె పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, మేస్త్రీలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ



పాలసముద్రం, మార్చి 18: తిరుమలరాజుపురం జడ్పీ పాఠశాలలోని తొమ్మిదో తరగతి విద్యార్థులు ప్లాస్టిక్ రీసైక్లింగ్ డే సందర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. అలాగే పాఠశాల నుంచి నరసింహాపురం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పొలాల్లో వేయడం వల్ల సారవంతమైన భూములు వృథాగా మారుతాయని చెప్పారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం గుణశేఖర్, ఉపాధ్యాయులు మురగదాస్, శ్రీనివాసులు, ప్రకాష్, వాసు, వినోద్ పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఐరాల విద్యార్థులు



ఐరాల(కాణిపాకం), మార్చి 18: ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కోమల, పీడీ దేవా సోమవారం తెలిపారు. ఇటీవల అనంతపురం జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు వంశీకృష్ణ, హేమలత ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. క్రీడాకారులను చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌యాదవ్, కార్యదర్శి రమేష్ అభినందించారు.

అశోకరాజు మాతృమూర్తికి భాను నివాళి



విజయపురం, మార్చి 18: సిద్ధార్థ గ్రూపు సంస్థల అధినేత, టీజేపీ నేత అశోకరాజు మాతృమూర్తి నరసమ్మ మృతదేహం వద్ద సోమవారం నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబీకులను పరామర్శించారు. టీడీపీ నాయకులు ధనుంజయయాదవ్, రమేష్‌రాజు, బాబుయాదవ్, బాలసుబ్రహ్మణ్యం రాజు, సుధాకర్‌రాజు తదితరులున్నారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, మార్చి 18: డీఆర్‌ఎన్ కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం కొండ మల్లీశ్వరుడికి శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం చేశారు. అర్చనలు, అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వైభవంగా పంగుణోత్తర బ్రహ్మోత్సవాలు



చంద్రప్రభ వాహనంపై కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి

నగరి, మార్చి 18: నగరి పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో పంగుణోత్తర బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు కామాక్షి సమేత కరకంఠేశ్వస్వామి చంద్రప్రభ వాహనంపై విహరించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తి ప్రపత్తులతో రామానుజ గోష్ఠి



రామానుజ విగ్రహానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు వేణుగోపాల్

చిత్తూరు కల్చరల్, మార్చి 18: కోదండరామాలయంలో చిత్తూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రామానుజ గోష్ఠి భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. రామానుజ విగ్రహానికి ఆలయ అర్చకుడు వేణుగోపాల్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. నగరంలోని వేద పండితులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఒకరి అరెస్టు



నిందితుడు, మద్యాన్ని చూపుతున్న పోలీసులు

చిత్తూరు, మార్చి 18: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.70వేల విలువైన కర్ణాటక మద్యం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ప్రసాద్‌తో కలిసి రెండో పట్టణ సీఐ ఉలసయ్య వివరాలను మీడియాకు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మద్యం అక్రమ రవాణాపై పోలీసులు నిఘా పెట్టారు. ముందస్తు సమాచారంతో సోమవారం చిత్తూరు- అరగొండ రోడ్డులోని కాణిపాకం జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. చిత్తూరు మార్కెట్‌చౌక్‌కు చెందిన గిరిధర్(26) ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా, కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని రూ.20వేల విలువైన మద్యం, రూ.50వేల విలువైన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. మద్యాన్ని పట్టుకున్న ఏఎస్‌ఐ మనోహర్, సిబ్బంది బాబు, తవరాజ్, హరిప్రసాద్, గోవిందరావులను సీఐ ఈ సందర్భంగా అభినందించారు.

200 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం: విక్రేత అరెస్టు

బంగారుపాళ్యం: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. పోలీసులకు అందిన సమాచారంతో వేపనపల్లికి చెందిన జగన్నాథం.. మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతడి ఇంటి వద్ద తనిఖీలు నిర్వహించగా 200 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు బయటపడటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైసీపీ అభ్యర్థి ప్రచారం

పాలసముద్రం, మార్చి 18: పాలసముద్రం, బాలకృష్ణాపురం, తిరుమలరాజుపురం, నరసింహాపురం, గంగమాంబాపురం పంచాయతీల్లో వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి సోమవారం ప్రచారం చేశారు. మండల పార్టీ కన్వీనర్ తులసీరామ్, జడ్పీటీసీ అన్ను తదితరులున్నారు.

మహిళలందరూ కూటమివైపే



టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలను చూపుతున్న మహిళలు

చిత్తూరు రూరల్, మార్చి 18: మహిళలందరూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైపే ఉన్నారని చిత్తూరు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ అన్నారు. చిత్తూరు రూరల్ మండలంలోని అనంతాపురం పంచాయతీ జంగాలపల్లిలో మహిళలతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మండల మాజీ ఎంపీపీ సునీత, టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, అరుణ, వైవీ రాజేశ్వరి, మేషాక్, రఘు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కరపత్రాల పంపిణీ



విజయపురం, మార్చి 18: కమ్మకండ్రిగ, ఒరూరు, ఆలపాకం, ముత్తప్పరెడ్డి కండ్రిగ, మాధవరం, ఎల్లసముద్రం గ్రామాల్లో సూపర్స్ సిక్స్ పథకాల కరపత్రాలను టీడీపీ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో యువత, మహిళలు మార్పును కోరుకుంటున్నారని చెప్పారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, జనసేన ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు సుధాకర్‌రాజు, తులసిరామానాయుడు, మురళీనాయుడు, బాలయ్య, రవిచంద్రారెడ్డి, శివలింగం, మహేష్, జయరాజ్, సెల్వం, ఆర్ముగంరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, మహేంద్ర, కపిల్ పాల్గొన్నారు.

జగన్‌ను సాగనంపడానికి ప్రజలు సిద్ధం

- నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్



చవరంబాకంలో గ్రామస్తులు, టీడీపీ నేతలతో భాను ప్రకాష్

నిండ్ర, మార్చి 18: జగన్‌ను సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని చవరంబాకం గ్రామ పంచాయతీలో మీకోసం.. మీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ.. టీడీపీ ప్రకటించిన పథకాలతో ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని చెప్పారు. టీడీపీ నాయకులు దశరథవాసు, ధనంజయులు నాయుడు, వెంకటేశ్వరరావు, లోకనాథ నాయుడు, రామూర్తినాయుడు, మునిరత్నంనాయుడు, వీరయ్య నాయుడు, జయరాం, చిట్టిబాబు, మునియప్ప, ధనంజయనాయుడు, రవినాయుడు, మనోజ్ యాదవ్, తేజేష్, బాబుయాదవ్, గాలి రమేష్‌నాయుడు, మురళీనాయుడు, ప్రకాష్, జనసేన నాయకులు మహేష్, శివలింగం, జయప్రకాష్, బీజేపీ నాయకులు బాలకృష్ణ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు: చవరంబాకం గ్రామంలో భానుప్రకాష్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. ఆయన అందరికీ పార్టీ కండువాకప్పి, టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో.. సురేష్‌బాబు, రామచంద్రా, దేవరాజు, పి.రవి, బుజ్జిబాబు తదితరులున్నారు.

రాజకీయ పునరావాస కేంద్రంగా ఏపీపీఎస్సీ

- తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరోపణ



మీడియాతో మాట్లాడుతున్న వరుణ్ కుమార్

చిత్తూరు సిటీ, మార్చి 18: వైసీపీ ప్రజాప్రతినిధులకు రాజకీయ పునరావాస కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) మారిందని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ ఆరోపించారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జగన్ రెడ్డి పథకం ప్రకారం సమీప బంధువులను ఏపీపీఎస్సీ బోర్డు సభ్యులుగా నియమించుకుని తనకు లబ్ధి చేకూరేలా చేసుకున్నారని మండిపడ్డారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందించి సంబంధిత నోటిఫికేషన్‌లో ఎంపికైన అధికారుల వివరాలను రాష్ట్ర గవర్నర్‌కు నివేదించి, వారిని ఎన్నికల విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, సునీల్ కుమార్, కాంద్ర రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కటారి కుటుంబం సేవలు మరువలేనివి

- చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్



కొలిమిలో సమ్మెటతో కొడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 18: కటారి కుటుంబం సేవలు మరువలేనివి చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం కన్నయ్య నాయుడు కాలనీలో దివంగత కటారి మోహన్ అనుచరులు, అభిమానులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. మాజీ మేయర్ కటారి అనురాధ మోహన్ ఆధ్వర్యంలోనే నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. కటారి కుటుంబం అంటేనే నియోజకవర్గంలోని ప్రజలకు ప్రత్యేక అభిమానమని కొనియాడారు. ప్రజా సేవకే తమ జీవితాలను అంకితం చేశారని చెప్పారు. మాజీ మేయర్ కటారి హేమలతను తమ ఇంటి ఆడబిడ్డలా చూసుకుంటామని హామీ ఇచ్చారు. అందరూ సహకరించి తనను ఎమ్మెల్యేగా గెలిపించి, నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే ఎస్టేట్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కొలిమిలో కొంతసేపు పనిచేశారు. అక్కడున్న కార్మికుడితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, నేతలు చంద్రప్రకాష్, కాజూరు బాలాజి, వసంత్‌కుమార్, గోపి, కిషోర్, సతీష్, రాజశేఖర్, యువరాజులు నాయుడు, రామ్మూర్తి, గోకుల్, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా చిత్తూరును నిలుపుదాం: జేసీ



సమావేశంలో ప్రసంగిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 18: ఎన్నికల నిర్వహణలో చిత్తూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుదామని అధికారులకు రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వివిధ బృందాలతో కలసి ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. సి-విజిల్ యాప్ ద్వారా, కాల్ సెంటర్, ఆర్వో ద్వారా వచ్చే ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిశీలించి రిపోర్టును జిల్లా ఎన్నికల అధికారికి పంపించాలన్నారు.

సచివాలయాల పరిధిలోని పోస్టర్లు, బ్యానర్లు తొలగించండి

చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల్లో రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు తొలగించాలని జేసీ అన్నారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నగరపాలక సంస్థ కమిషనర్, ఏఆర్వో అరుణతో కలసి 25 వార్డు సచివాలయాల సిబ్బంది, అధికారులతో సమావేశమయ్యారు. ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, రిసోర్స్ పర్సన్లు, రేషన్ షాపు డీలర్లు ఏ రాజకీయ పార్టీల ప్రచారాలు, సమావేశాల్లో పాల్గొనరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే సచివాలయ కార్యదర్శులు అలాంటి వారి ఫొటోలను తీసి ఆర్వో, ఏఆర్వోలకు పంపాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఆర్వో, ఏఆర్వో, సెక్టోరల్ అధికారి, బీఎల్వో, ఎస్‌ఐ ఫోన్ నెంబర్లు, నియోజకవర్గం పేరు, పోలింగ్ కేంద్రం నెంబరును రెండ్రోజుల్లోపు పెయింటింగ్ చేయించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేసేవారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

వెదురుకుప్పంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలివే

వెదురుకుప్పం, మార్చి 18: మండలంలో 41 పోలింగ్ కేంద్రాలుండగా, ఆరు కేంద్రాలను సమస్యాత్మకంగా అధికార యంత్రాంగం గుర్తించింది. గుర్తించారు. వీటిల్లో.. పచ్చికాపల్లంలోని మూడు, జక్కిదొనలోని రెండు, మాంబేడులోని పోలింగ్ కేంద్రం ఉన్నాయి.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

ఐరాల, మార్చి 18: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఐరాలలో 134 మంది విద్యార్థులకు 132 మంది, ఎం.పైపల్లెలో 121 మందికి 121 మంది, కాణిపాకంలో 102 మంది విద్యార్థులకు 102 మంది హాజరయ్యారు.

శ్రీరంగరాజపురం: మండలంలో 375 మంది విద్యార్థులకుగాను 375మంది హాజరయ్యారు. 49.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవో అరుణాచాలంరెడ్డి తనిఖీ చేశారు.

పాలసముద్రం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 166 మంది విద్యార్థులకుగాను అందరూ హాజరయ్యారని పరీక్షల నిర్వహణ చీఫ్ దేవరాజులు, డిపార్టుమెంటల్ ఆఫీసర్ యువరాజ్ తెలిపారు. పరీక్ష కేంద్రంలో అన్ని వసతులు కల్పించినట్లు హెచ్‌ఎం మీనాక్షి పేర్కొన్నారు.

వెదురుకుప్పం: మండలంలో 430 మంది విద్యార్థులకు 430 మంది హాజరయ్యారు. ఈ మేరకు ఎంఈవో దామోదరం తెలిపారు.

నగరి: మండలంలో 1193 మందికిగాను 1180 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు సీడబ్ల్యుఎస్ వారికి మొదటి రోజు పరీక్షలేదు.

విజయపురం: పన్నూరు పరీక్ష కేంద్రంలో 133 మందికి 126 మంది, విజయపురంలో 111 మందికిగాను 103 మంది హాజరైనట్టు ఎంఈవో ఆంజనేయులు తెలిపారు.

నిండ్ర: మండలంలో జరిగిన టెన్త్ పరీక్షలకు ముగ్గురు పరీక్షలు హాజరు కాలేదు. ఈ మేరకు పరీక్ష కేంద్రం చీఫ్ అమరనాథరెడ్డి తెలిపారు.

గుడిపాల: మండలంలో 309 మంది విద్యార్థులకుగాను 309 మంది హాజరయ్యారు. ఈ మేరకు ఎంఈవో రామ్‌నాయక్ తెలిపారు.





నరహరిపేట హైస్కూల్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు - పాలసముద్రం పాఠశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పరిశోధనా రంగంవైపు విద్యార్థులు మొగ్గు చూపాలి



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కేటీ రామకృష్ణ

నగరి, మార్చి 18: పరిశోధనా రంగం వైపు విద్యార్థులు మొగ్గు చూపాలని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. పదార్థ విజ్ఞానశాస్త్రంలో ఆవిష్కరణలు - పురోగతులు అనే అంశంపై విద్యార్థులకు మూడ్రోజుల జాతీయ శిక్షణశిబిరాన్ని సోమవారం కళాశాలలో ప్రారంభించారు. బిట్స్ పిలాని హైదరాబాద్‌కు చెందిన భౌతిక శాస్త్రం ఆచార్యుడు బీఎస్‌రెడ్డి మాట్లాడుతూ.. అడ్వాన్స్ సింథసిస్ ఆఫ్ నానో మెటీరియల్స్ ఫర్ వేరియస్ అప్లికేషన్స్ అనే అంశాన్ని విద్యార్థులకు వివరించారు. ఎస్వీయూ మాజీ రెక్టార్ సి.కె.జయశంకర్, వర్సిటీ సైన్స్ విభాగం అధ్యక్షుడు కేటీ రామకృష్ణ, ప్రభుత్వ డిగ్రీకళాశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ బాబు ఆవిష్కరణలు-పురోగతులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూతగాదాలో ముగ్గురికి స్వల్పగాయాలు

పుంగనూరు రూరల్, మార్చి 18: భూతగాదాలో ఇరువర్గాలు దాడులకు పాల్పడడంతో ముగ్గురు స్వల్పంగా గాయపడి సోమవారం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పుంగనూరు మండలం మేలుందొడ్డికి చెందిన అంజప్ప, శ్రీనివాసులు పొలం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన చంద్రారెడ్డి, వెంకటరెడ్డి, యుగంధర్‌లు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో అంజప్ప, శ్రీనివాసులు, వెంకటరెడ్డిలు గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సారా స్వాధీనం : ఇద్దరి అరెస్ట్

కల్లూరు, మార్చి 18: పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లి సమీపంలోని గౌరీ వంక వద్ద సారాను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గౌరీ వంక వద్దకు పోలీసులు చేరుకోగా 50 లీటర్ల సారాను తరలిస్తున్న వెంకటరమణ, రవిని అదుపులోకి తీసుకున్నారు. సారాను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధం : అమర్



మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి18: జగన్‌రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం స్థానిక నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్ప సభ విజయవంతం అయిందన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం తరలివచ్చి తమ మద్దతు తెలపడమే నిదర్శనమన్నారు. జగన్ పాలనలో ఆర్థిక దుర్వినియోగం, అవినీతికి మారుపేరుగా మారిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఖాజాపీర్, ఉమర్, నాగరాజు, మదన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వీటిని తొలగించేదెప్పుడు?



వసంతాపురంలో తొలగించని లైటింగ్ బోర్డు

గుడిపాల, మార్చి 18: మండలంలోని వసంతాపురం పంచాయతీలో అధికార పార్టీకి చెందిన నాలుగైదు లైటింగ్ బోర్డులు సోమవారం నాటికి కూడా తొలగించలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు వీటిని తొలగించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.

కొల్లాగుంట వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు



కార్వేటినగరం, మార్చి 18: కొల్లాగుంట వద్ద పోలీస్ చెక్‌పోస్టును ఆదివారం ఏర్పాటు చేశారు. కార్వేటినగరం మండలం తమిళనాడుకు చెందిన పల్లెపట్టు తాలూకాకు ఆనుకుని ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల దృష్ట్యా అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతంగా ఉన్న కొల్లాగుంట వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటైంది. పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ చెక్‌పోస్టు ఎంతో కీలకమైన ప్రాంతంగా పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. సోమవారం సైతం ఈ చెక్‌పోస్టు ప్రాంత జాతీయ రహదారిపై పోలీస్ అధికారులు నిఘా పెట్టారు.

సీఏఏని వెంటనే రద్దు చేయాలి: సీపీఐ



సమావేశంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

నగరి, మార్చి 18: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. నగరి పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య ప్రసంగించారు. సీఏఏ విషయంలో టీడీపీ, జనసేన తమ వైఖరిని తెలియజేయాలన్నారు. నాయకులు వేలన్, బాషా, బాబు, ప్రసాద్ సిరావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భూత, శేషవాహనాలపై అగస్త్యేశ్వరుడి చిద్విలాసం



భూత వాహన సేవలో పాల్గొన్న భక్తులు

చిత్తూరు కల్చరల్, మార్చి 18: కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో పంగుణి మాస బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం భూత వాహన, సాయంత్రం శేషవాహన సేవలు జరిగాయి. ఉదయం సేవకు వి.ఎ.మహేశ్వరి, వి.అశోక్‌కుమార్, విద్యాసాగర్, చైతన్యకుమారి, ప్రమీళ, రాజశేఖర్, హరిచందన, అంకాళపరమేశ్వరి అభివృద్ధిట్రస్ట్, సాయంత్రం సేవకు బద్రినాథ్, బాలాజిగుప్తా, రఘుపతి శెట్టి, పుష్పలత, రమేష్‌బాబు సౌందర్య, సాయి దీపక్‌లు ఉభయదారులు వ్యవహరించారు. ఆలయ ఈవో తిమ్మారెడ్డి, శివప్రసాద్, మల్లికార్జున్, టి.వెంకటేషన్, భక్తులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు శిక్షణ



యూకే వైద్యుడు మో సోబి

చిత్తూరు రూరల్, మార్చి 18: చిత్తూరులోని అపోలో వైద్య కళాశాలలో సోమవారం జరిగిన అంతర్జాతీయ నైపుణ్య శిక్షణకు విశేష స్పందన లభించింది. యూకేకి చెందిన అంతర్జాతీయ నైపుణ్య శిక్షకుడు డాక్టర్ మో సోబి వైద్య విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వైద్య విద్య, పారా మెడికల్ కోర్సుల కోసం యూకే నిర్వహించే యూకేఎంఎల్ఏ, పీఎల్ఏబీ పరీక్షలకు ఎలా సిద్ధం అవ్వాలనే అంశాన్ని తెలియజేశారు. తమకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు తెలిపారు. వైద్య, పారామెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్లిన డాక్టర్‌కు సన్మానం

కార్వేటినగరం, మార్చి 18: కార్వేటినగరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పదోన్నతిపై శ్రీకాళహస్తి ఆస్పత్రికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన్ను వైద్యశాలలో ప్రభుత్వ వైద్య సిబ్బంది, వైద్యులు సన్మానించారు.